# పార్కులను అభివృద్ధి చేసింది నేనే..

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**ఎల్‌బీనగర్:** మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ఎల్‌బీనగర్‌లో మరింత అభివృద్ధి జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ పార్కులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో తానే అనేక పార్కులను అభివృద్ధి చేశానని తెలిపారు. వాకర్స్‌తో పాటు పచ్చదనం కోసం పార్కులకు వచ్చే వారికి మరింత ఆహ్లాదం పంచడానికి మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఉందన్నారు. నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి, సామ బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు, నాయుడు, రాంబాబు, మల్లేష్‌గౌడ్, చరణ్, సతీష్ పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీపార్కులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా

**మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్**



ఎల్‌బీనగర్‌లో వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు తెలుపుతున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

**నాగోలు:** మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గానికి సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, శివగంగ కాలనీ, నాగోలు పరిధిలోని సాయినగర్ కాలనీ, మమతానగర్, ఉప్పల్, నియోజకవర్గం, మేడ్చల్, మల్కాజిగిరి ప్రాంతాల్లోని వివిధ కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు తనను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. తనను ఎంపీ గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తానని, ప్రతీ నియోజకవర్గంలో ఆదర్శ విద్యాలయాలు, ధర్మాసుప్రతులు నెలకొల్పుతానని అన్నారు. నిత్యం ప్రజల మధ్దే ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపరచిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడ్డు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్, సుశీల, చంద్రకళా పాల్గొన్నారు.

# రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



రామకృష్ణాపురం డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేత భాస్కర్ రెడ్డి తదితరులు

**దిల్‌సుఖ్‌నగర్:** త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆర్‌కే పురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... మేనిఫెస్టోలోని గ్యారెంటీ ప్రథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్ యాదవ్, రాజు నాయక్, అక్బర్, కల్యాణ్, డక్కర్ నాయక్, షఫీ, పటేల్ సురేష్, అహ్మద్, శేఖర్, మహమ్మద్,శివ,సురేష్,ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని

- సర్కిల్–3 ఏఎంహెచ్‌ఓపై చర్యలకు డిమాండ్

## బీజేపీ ధర్నా



బీఎన్‌రెడ్డి నగర్‌లోని సాగర్ కాంప్లెక్స్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు సామ రంగారెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు

**ఎల్‌బీనగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులపై దాడులు పెరిగాయని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాగర్ కాంప్లెక్స్ వద్ద పాతబస్తీకి చెందిన కొందరు పండ్ల వ్యాపారులు, గంజాయి బ్యాచ్ కలిసి ఎస్టీ యువకుడు సభావత్ రాజునాయక్‌పై దాడి చేయడం వల్ల చావు బతుకుల్లో ఉన్నాడని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సాగర్ కాంప్లెక్స్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సామ రంగారెడ్డి మాట్లాడుతూ, మతోన్మాదులు హిందువులపై దాడులు చేస్తున్నారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సాగర్ కాంప్లెక్స్ వద్ద ఫుట్‌పాత్‌పై అక్రమంగా షెడ్లు వేసుకుని వ్యాపారం చేస్తున్న మైనార్టీలు ఈ దాడి చేశారని ఆరోపించారు. ఎల్‌బీనగర్ సర్కిల్–3 ఏఎంహెచ్‌ఓ లావణ్య నిర్లక్ష్యం వల్లే దాడి జరిగిందన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని అక్కడి నుంచి తొలగించాలని తాను అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లావణ్యపై చర్యలు తీసుకోవాలని ఆయన గ్రేటర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గంట పాటు సాగర్ రహదారిపై బీజేపీ నాయకులు ధర్నాకు దిగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి వచ్చి బీజేపీ నాయకులతో చర్చలు జరపడంతో ధర్నా విరమించారు. పోలీసులు అరగంట పాటు శ్రమించి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు జేసీబీ సహాయంతో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించే వరకూ బీజేపీ నాయకులు అక్కడే ఉన్నారు. ధర్నాలో డివిజన్ అధ్యక్షుడు నవకిశోర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రావు, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, శరత్‌కుమార్, చందు, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ప్రయాణికులు

బీజేపీ నాయకులు అకస్మాత్తుగా సాగర్ హైవేపై ధర్నాకు దిగడంతో సుమారుగా 45 నిమిషాల పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో అటు తుర్కయాంజాల్..ఇటు ఎల్‌బీనగర్ వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేక పోయారు. మరోవైపు వాహనాలు పోకుండా బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో ఉద్యోగులు సైతం అసహనం వ్యక్తం చేశారు. కొందరు ప్రయాణికులు బీజేపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు.



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**ఎల్‌బీనగర్:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హరిహరపురం సీనియర్ సిటిజన్ నాయకులు మంగళవారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హరిహరపురం కాలనీ వాసులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అందరూ పోలింగ్ రోజున ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు రావాలని వారు పిలుపునిచ్చారు. ర్యాలీలో రమణ, రఘుపతిరావు, నారాయణరెడ్డి, రవీంద్రకుమార్, వనజాక్షి, వెంకటయ్య, రంగనాథం, రవీందర్‌రావు, సంజీవరావు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ఉజ్వల భవితకు బీజేపీని గెలిపించాలి

**హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల**

**మలక్‌పేట:** దేశ యువత ఉజ్వల భవిష్యత్ కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం భరద్వాజ అపార్ట్‌మెంట్‌లో కాలనీవాసులను కలిశారు. తనను గెలిపిస్తే పాతబస్తీలో అభివృద్ధిని చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నాయకులు యమన్‌సింగ్, సుదర్శన్‌చారి, సత్యనారాయణ, రాంరెడ్డి, రమేష్‌గుప్తా, అపార్టుమెంట్‌వాసులు పాల్గొన్నారు.

## మోదీని మూడోసారి ప్రధానిని చేద్దాం: కొప్పుల

**మన్సూరాబాద్:** ఈటల రాజేందర్‌ను గెలిపించి.. మూడోసారి మన మోదీని ప్రధానినీ చెద్దామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌ డివిజన్ హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీ, ఆదిత్యానగర్, టీనగర్, ఎల్లారెడ్డికాలనీలలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కమలం పువ్వుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, సంధ్యారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సాయిరాంగౌడ్, మూర్తి, కోటయ్య, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**మోదీని మళ్లీ ప్రధానిని చేయాలి ..**



శారదానగర్‌లో ప్రచారం చేస్తున్న నవజీవన్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం:** భారత ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీని చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, కమలం గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బీజేపీ అభ్యర్థి ఈటలకు మద్దతుగా మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో ఇంటింటికీ వెళ్లి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రపంచ దేశాలు గౌరవించేలా భారత్‌ను అభివృద్ధి చేసిన ఘనత నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. నాయకులు డాక్టర్ అప్పారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలతో ప్రజలకు ఎంతో మేలు

**నాగోలు:** వేసవి కాలంలో చలి వేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. నాగోలు ప్రధాన రోడ్డులో రింకు సింగ్ బృందం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ, ఎండ తీవ్రతతో అల్లాడుతున్న బాటసారులు, స్థానికులకు మజ్జిగ పంపిణీతో ఉపశమనం కలుగుతుందని, ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన రింకు సింగ్ బృందానికి అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మంచి రాజేష్, సంగ్రామ్, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**చైతన్యపురి:** ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న పాత నేరస్తుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం...వనస్థలిపురంలో నివసించే పగడాల గణేష్ (28) డ్రైవర్.జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్ చోరీల బాట ఎంచుకున్నాడు. చోరీ చేసిన బైక్‌లను ఇతరులకు విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు.దొంగిలించిన బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్‌ను చైతన్యపురి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీల గుట్టు బయటపెట్టాడు. దొంగతనం కేసులో గతంలో జైలుకెళ్లి గత సెప్టెంబర్‌లో బయటకు వచ్చి మళ్లీ ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్నట్టు తెలిపాడు. గణేష్‌పై వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో మొత్తం 21 కేసులు ఉన్నాయని, నిందితుడి నుంచి 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

## 'మోత్కుపల్లి'పై ఫిర్యాదు

**మలక్‌పేట:** సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ మంగళవారం మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశా రు. శ్రీనివాస్ మాట్లాడుతూ..పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేయడం శోచనీయమ న్నా రు. పార్టీ డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, చక్రపాణి,. రాహుల్‌సింగ్, షకీల్, షాహెద్‌ఖాన్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టే పార్టీలను ఓడించాలి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఈటీ నరసింహ

**సైదాబాద్:** పాతబస్తీలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య భవన్‌లో సీపీఐ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీపీఐ హైదరాబాద్ కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈటీ నరసింహ మాట్లాడుతూ.. ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి సమీఉల్లాకు మద్దతు తెలిపి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని గత ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు చేసిన మోదీ మరోసారి ప్రజలను తన తప్పుడు గ్యారంటీలతో మభ్య పెట్టడానికి యత్నిస్తున్నాడని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నాయకులు శంకర్ నాయక్, యాదగిరి, స్టాలిన్, సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, జంగయ్య పాల్గొన్నారు.

## అందుబాటులోకి స్విమ్మింగ్‌పూల్స్

**వనస్థలిపురం:** వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో కోట్లాది రూపాయలతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్స్ నీటి కొరతతో వేసవి కాలం వచ్చినా తెరుచుకోక పోవడంతో 'ఈత కొట్టేదెలా...కొలనులు ఇలా' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురించడంతో పాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి స్థానికులు స్విమ్మింగ్‌పూల్స్ దుస్థితిని తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు జలమండలి అధి కారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా స్విమ్మింగ్‌పూల్స్‌కు నీటిసరఫరాకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఎట్టకేలకు మంగళవారం వనస్థలిపురం ఫేజ్– 4లోని స్విమ్మింగ్‌పూల్, బీఎన్‌రెడ్డినగర్ సచివాలయనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కాగా, జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో పేరు, స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి ఈత కొట్టడానికి అవకాశం ఉంటుంది. నేరుగా వచ్చేవారికి ప్రవేశం లేదు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు స్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి.





# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ కార్యదర్శి సందీప్‌రెడ్డి

**ఎల్‌బీనగర్:** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి వందలాది మంది నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మధుయాష్కీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ నాయకులు ఒంటెద్దు పోకడలకు నిరసనగానే తాను ఆ పార్టీని వీడి కాంగ్రెస్ చేరానని, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, వింజమూరి శ్రవన్‌కుమార్‌రెడ్డి, మెట్టుపల్లి సంతోష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

**వనస్థలిపురం:** నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం వనస్థలిపురం డివిజన్‌లోని గుంటి జంగయ్య నగర్ కాలనీలో నిర్వహించిన నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, షాలిని, నరసింహ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా..**

**లింగోజిగూడ:** త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో టీపీసీసీ ప్రచారం కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

**కొత్తపేటలో...**

**నాగోలు:** మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా తనను గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొత్తపేట డివిజన్‌లోని రాజీవ్ గాంధీ నగర్, భరత్ నగర్, శివమ్మ నగర్, అంబేడ్కర్ కాలనీ, శ్రీశంకర్ కాలనీ తదితర కాలనీల్లో ప్రచారం చేశారు.



ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో ప్రచారం చేస్తున్న సునీతా మహేందర్‌రెడ్డి

# తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

**మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి లక్ష్మారెడ్డి**

**మన్సూరాబాద్:** తెలంగాణ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల అధ్యక్షులతో మంగళవారం ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్, హైదరాబాద్ నగరాన్ని కేటీఆర్ అభివృద్ధి చేయగా, ఎల్‌బీనగర్ నియోజకవర్గ రూపురేఖలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మార్చారని అన్నారు. తాను గత 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉండి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని దుయ్యబట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని, మల్కాజిగిరి ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతానని అన్నారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, జగదీష్‌గౌడ్, నర్సింహగౌడ్, వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

**బీఆర్‌ఎస్‌లో చేరిక..**

మన్సూరాబాద్: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బీజేపీ నేత బాతరాజు శంకర్ మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

**చంచల్‌గూడ:** మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో 8 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో మంగళవారం నాంపల్లి కోర్టు దోషికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించింది. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. 2021లో మాదన్నపేటలో నివసిస్తున్న మహ్మద్ సలీం (45) బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింది పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును విచారించిన పోక్సో కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి పి.పుష్పలత మంగళవారం సలీంను దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించారు.

# ఈదురు గాలులకు కూలిన చెట్లు

**నాగోలు:** నగరంలో భారీ ఈదురు గాలులతో వర్షం పడటంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో వాహనదారులు, పలు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు పడి కరెంట్ నిలిచిపోయింది. ఎల్‌బీనగర్ పరిధిలోని మన్సూరాబాద్, నాగోలు పరిధిలోని సాయినగర్ కాలనీలో ఇతర ప్రాంతాలలో వర్షం నీరు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నాగోలు సాయినగర్ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగి పడగా, విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. రోడ్డుపై పడిన చెట్లను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు.

**హిమపురికాలనీని ముంచెత్తిన నీరు..**

**మన్సూరాబాద్:** భారీ వర్షంతో మన్సూరాబాద్‌లోని లోతట్టు ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సహారాస్టేట్స్ కాలనీ వెనుకవైపు ఆటోనగర్ రోడ్డులో వరదనీటి కాలువ పనులు అసంపూర్తిగా ఉండటంతో మంగళవారం కురిసిన వర్షానికి వరద నీరు పెద్ద ఎత్తున చేరి హిమపురికాలనీ ఫేజ్–2ను ముంచెత్తింది. వరద ముంపు ప్రాంతాలను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు.



మన్సూరాబాద్ భవానీ నగర్‌లో కూలిన చెట్లు